కులవృత్తికి చేయూత కరువు

- దోభీఘాట్లు లేక రజకుల ఇక్కట్లు
- గత ప్రభుత్వంలో ఏటా రూ.10 వేల ఆర్థికసాయం
- కూటమి ప్రభుత్వంలో దక్కని భరోసా


ఎన్పీకుంటలో చాకిరేవు నుంచి దుస్తులు తీసుకొస్తున్న రజకులు

ఎన్పీకుంట: రజకుల జీవనం కష్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో దోభీఘాట్లు లేకపోవడంతో రజకులు ఇబ్బందులు పడుతున్నారు. కదిరి నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు 1400 రజకుల కుటుంబాలు కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఇందులో కదిరి, తలుపుల, గాండ్లపెంట, తనకల్లు మండలాలలో 8 దోభీఘాట్లు ఉండగా 5 వినియోగంలో లేవు. అలాగే ఎస్.పీ.కుంట, నల్లచెరువు మండలాల్లో దోభీఘాట్లు లేకపోవడంతో కుంటలు, చెరువులు, కాలువలపై ఆధారపడాల్సి వస్తోంది. వేసవి సమీపిస్తుండటంతో చెరువులు, కుంటలు ఎండిపోతే వారి జీవనం కోసం మరింత శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సుమారు రెండు, మూడు కిలోమీటర్ల దూరం దుస్తులను మోసుకొని తీసుకెళ్లాల్సిందే. లేదా కుళాయి నీటితోనే ఇంటి వద్దనే బట్టలు ఉతకాల్సి వస్తుంది. శుభ్రం చేసిన దుస్తులు ఆరవేసేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఆయా గ్రామాల్లో రజకులకు ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గ్రామాల్లో కనీసం దోభీఘాట్లు, నీటి సౌకర్యం కల్పిస్తే రజకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

కదిరి నియోజకవర్గంలో రజకుల కుటుంబాలు

మండలం	రజకులు
కదిరి	300
ఎన్పీకుంట	280
తనకల్లు	300
గాండ్లపెంట	110
తలుపుల	200
నల్లచెరువు	190

సమస్యలు పరిష్కరించాలి



వేసవిలో చాలా గ్రామాల్లో పూర్తిస్థాయిలో నీరు ఉండదు. వర్షాకాలంలో సైతం చెరువుల కింద, చిన్నచిన్న కాలువలు, కుంటల్లో దుస్తులు ఉతకాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి బోర్లు, దోభీఘాట్లు ఏర్పాటు చేసి రజకుల సమస్యలను పరిష్కరించాలి. అలాగే సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

– కె.రెడ్డప్ప, రజకుడు

పింఛన్ మంజూరు చేయాలి



కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమకి ప్రభుత్వం చేయూత అందించాలి. రోజూ దుస్తులు తీసుకువెళ్లి ఉతికి, అందులో వచ్చే చాలిచాలని డబ్బుతో జీవనం సాగిస్తున్నాం. మా కష్టాలను గుర్తించి 50 సంవత్సరాలు దాటిన వారికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తే బాగుంటుంది.

– చిన్నరమణ, రజకుడు, నల్లచెరువు మండలం

గతంలో ఏటా రూ.10 వేల సాయం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులవృత్తుల వారి సంక్షేమం కోసం ఏటా వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.10,000 జమ అయ్యి, చేదోడు వాదోడుగా ఉండేది. ప్రస్తుతం ఎటువంటి సహకారం అందడం లేదని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక బీసీ కార్పొరేషన్ కింద మంజూరు చేసే సబ్సిడీ రుణాల్లోనే తమకు అన్యాయమే జరుగుతోందని వాపోతున్నారు. ఖర్చులు ఎక్కువ అవడంతో కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగించడం కష్టం అవుతుండటంతో చాలా మంది రజకులు బెంగుళూరు, హైదరాబాదు వంటి మహానగరాలకు వలస పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కులవృత్తుల వారిని ఆదరించాలని రజకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్‌లో రాణించిన విద్యార్థులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపడం హర్షణీయమని పాఠశాల హెచ్ఎం శైలజ, పీడీ నాగేంద్ర తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం క్రీడల్లో రాణించి ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్‌లో అశోక్, మనోజ్, సాయి ప్రసాద్, టేబుల్ టెన్నిస్‌లో అశోక్, మధు, పవన్‌కుమార్, బాస్కెట్‌బాల్‌లో శశిధర్, కార్తీక్‌నాయక్, లక్ష్మీనరసింహ, నెట్‌బాల్‌లో సాయికుమార్, బాల్‌బ్యాడ్మింటన్‌లో చిరంజీవి, మనోజ్, అశోక్, నిఖిల్, షూటింగ్ బాల్‌లో చరణ్ రాష్ట్రస్థాయిలో రాణించారన్నారు. ఉపాధ్యాయులు వేణుగోపాలాచార్యులు, శ్రీనివాసులు, హేమలత, లలితమ్మ, ప్రసాద్‌బాబు, సునితమ్మ, నాగరాజు, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌చంద్ర, హరికృష్ణ, శ్రీలత, శ్రీనివాసులు, రఫీక్ అహ్మద్, దివాకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయండి

పుట్టపర్తి: బుక్కపట్నంలో ఆగిపోయిన సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి కళాశాల అధ్యాపకుడు శ్రీనివాసులు, సిబ్బంది, విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీ కొంత మేరకు పడిపోయిందని, వాటి నిర్మాణానికి కృషి చేయాలని పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు జరుగుతున్న శిక్షణను తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠం బోధించారు.

ఎల్ఐసీలో తక్షణం నియామకాలు చేపట్టాలి


ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ధర్మవరం: ఎల్ఐసీలో తక్షణం నియామకాలు చేపట్టాలని, అఖిల భారత ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ ధర్మవరంలోని ఎల్ఐసీ శాఖ క్లాస్‌-3 ఉద్యోగులు ఒక గంట వాకౌట్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రవీంద్ర మాట్లాడుతూ రిటైర్‌మెంట్ తదితర కారణాల దృష్ట్యా సంస్థలో ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల పాలసీదారుల సేవలకు అంతరాయం కలుగుతోందన్నారు. ఎల్ఐసీలో 80 శాతానికి పైగా ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘంకు తక్షణమే గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు ఆనందరావు, భాష, రామన్న, నాగరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ విధానం కొనసాగించండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కదిరి టౌన్: మున్సిపల్ శాఖలో ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సీఐటీయూ నాయకులతో కలిసి మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలో 45 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, చనిపోయిన మున్సిపల్ కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, కృష్ణనాయక్, జనార్ధన్, బాలకృష్ణ, తిరుపాల్, సూరి, చెన్నక్రిష్ణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని గట్లు సమీపంలోని సుందరయ్య కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం ట్రాన్స్‌కో ఏడీఈ షాజహాన్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం కాలనీలో 250 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు. కాలనీలో ఇప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. నాయకులు జీఎల్ నరసింహులు, బాబ్జాన్, శాంతిబాయి, హేమ, జయశ్రీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయండి


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకల రాజా

ధర్మవరం: మెగా డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ సత్యసాయి జిల్లా కార్యదర్శి సకల రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కాలనీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతూ యువజన విద్యార్థి సంఘాలను పిలిపించుకుని మొదటి సంతకం డీఎస్సీ మీదనే పెడుతున్నానని చెప్పారన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కనీసం మినీ డీఎస్సీ కూడా ఇవ్వలేదని విమర్శించారు. రెడ్‌బుక్ సృష్టించడం మాత్రమే కాదని నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని తెలిపారు. అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసి 26 జిల్లాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలన్నారు. నిరుద్యోగులకు రూ.10 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇచ్చేలా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు సునిల్, విజయ్, అరుణ్ పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి


కదిరిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఓడీచెరువు: కేంద్ర ప్రభుత్వం ఏపీ విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సీపీఐ నాయకులు పెడబల్లి బాబా, వీవీ రమణ, సీపీయం మండల కన్వీనర్ కుళ్లాయప్ప, నాయకులు అంజి, రామిరెడ్డి, నరసింహులు, అలివేలమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని సీపీఎం నాయకులు విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ, విద్య, వైద్య రంగాలను ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వీవీ రమణ, సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఒంటెద్దు వేమన్న, నాయకులు ఎస్వీ రమణ, శ్రీనివాసులు, వెంకటేసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు మాట్లాడుతూ ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి కావలసిన చర్యలు ఈ బడ్జెట్‌లో లేవన్నారు. నాయకులు జగన్మోహన్, ముస్తక్, రామ్మోహన్, ఫాజిల్, అంజనేయులు, రెడ్డమ్మ, మున్ని, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాష, జేవీ రమణ, మారుతి విమర్శించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద గురువారం సీపీఎం నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో సీపీఎం నాయకులు ఎల్.ఆదినారాయణ, హైదర్‌వలి, హరి, వెంకటస్వామి, ఖాదర్‌బాషా, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు ఒంటి కాలిపై నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయు మండల కార్యదర్శి వెంకటేశులు, ఆవాజ్ కమిటీ నాయకులు బాబ్‌జాన్, మహబూబ్‌బాషా, అల్లా బక్షు, పక్కీరప్ప, వెంగముని, రామచంద్ర, ఆదెప్ప, బాల పెద్దన్న, ఓబిలేసు, హరి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక ఉందని, దాన్ని ప్రజలు తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ కోరారు. గురువారం కొత్తచెరువులో నెహ్రూ సర్కిల్ వద్ద కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, మండల కార్యదర్శి ముత్యాలు, ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి, కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు ప్రసాద్, సులోచన, కిష్టమ్మ, సుజాత, రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి ఇంట్లో చోరీ

ఓడీచెరువు: మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికుడి ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు..పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న భార్యాభర్తలు అంజినప్ప, నాగమ్మ గురువారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో ప్రతి షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వ్యాపారులకు సూచించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించి చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు మల్కాపురం గ్రామస్తులకు సూచించారు. గురువారం గ్రామంలో ఎస్ఐ సిబ్బందితో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. మద్యానికి బానిస కాకూడదన్నారు. అనంతరం మహిళలపై జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సజావుగా సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు

ధర్మవరం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు, మేదర, కుమ్మర కులాల కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలపై 15 మంది బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 1,900 మంది దరఖాస్తు చేసుకోగా 1,172 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అధికారులు విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, బర్త్ సర్టిఫికెట్ తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సబ్సిడీ రుణాలకు ఎంపికైన వారి జాబితాను బ్యాంకు అధికారులు త్వరలో ప్రకటిస్తారని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు.

ముదిగుబ్బ: మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ అధికారులు, బ్యాంకర్లు అభ్యర్థులు సర్టిఫికెట్లను పరిశీలించారు.

నల్లచెరువు: ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపీడీఓ రఘునాథ గుప్త, ఈఓఆర్డీ శకుంతల,ఏఓ రామకృష్ణ, ఏపీజీబి మేనేజర్ ప్రభావతి, ఫీల్డ్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 230 మంది దరఖాస్తు చేసుకోగా 140 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

స్థలం వివాదంలో ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: స్థానిక గూడ్స్‌షెడ్‌కొట్టాలలో స్థలం వివాదంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. వివరాలు.. చెన్నేకొత్తపల్లికి చెందిన దాసరి బోడయ్య 2010లో మల్లాకాలువ, రాంపురం గ్రామాలకు చెందిన చంద్రమోహన్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డితో గూడ్స్‌షెడ్‌కొట్టాలలో స్థలం కొనుగోలు చేశాడు.

ప్రస్తుతం బోడయ్య తన స్థలం వద్దకు వెళ్లగా ఈ స్థలం వేరే వారి పేరుమీద ఉందని స్థానికులు చెప్పడంతో చంద్రమోహన్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి వద్దకు వచ్చి తన స్థలం చూపించాలని కోరగా స్థలం ఏమిలేదంటూ చెప్పారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్పు తీర్చాలని అడిగినందుకు వ్యక్తిపై దాడి

పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన షేక్ సయ్యద్‌బాషా దుర్గానగర్‌లోనున్న అబ్దుల్లాకు రూ.7 లక్షలు అప్పుగా ఇచ్చాడు. గురువారం తన డబ్బు ఇవ్వాలని అబ్దుల్లాను అడగ్గా డబ్బు ఇవ్వను ఏమైనా చేసుకో అంటూ పైపు తీసుకుని షేక్ సయ్యద్‌బాషాపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఐచర్ వాహనం బోల్తా

ముదిగుబ్బ: మలకవేమల క్రాస్ సమీపంలో గురువారం ఐచర్ వాహనం బోల్తా పడింది. అయితే ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. అనంతపురం నుంచి చెన్నైకు టమాట లోడుతో బయలుదేరింది. వేగంగా వెళుతున్న ఐచర్ వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. స్థానికులు గమనించి డ్రైవర్‌ను వాహనం నుంచి బయటకు తీశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

పుట్టపర్తి: బుక్కపట్నం వాల్మీకి రామాలయ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటిని చౌకగా అందించి మంచిపేరు తెచ్చుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

జూదరుల అరెస్ట్

కదిరి అర్బన్: పట్నం గ్రామ సమీపంలో గురువారం పేకాట స్థావరంపై రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.15,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ


శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో గురువారం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలకు సంబంధించిన కృత్యాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఎంఈఓ రమణప్ప ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. ఆర్పీలు నాగేంద్ర, నారాయణ స్వామి, రాము పాల్గొన్నారు.

మెరుగైన వసతులకు డిమాండ్


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కనగానపల్లి: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసేందుకు వచ్చిన డీఈఓ కిష్టయ్యను ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, వైఎస్సార్ విద్యార్థి సంఘాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ హాస్టల్లో కలుషిత ఆహారం సంఘటనపై విచారణ చేపట్టాలన్నారు. స్థానిక వసతి గృహంలోని విద్యార్థినులకు సరైన ఆహారం, నీటి వసతి, సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, వైఎస్సార్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, పోతలయ్య, పురుషోత్తం, అమరనాథరెడ్డి, శివ, సీఐటీయూ నాయకుడు కదిరప్ప పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోండి


వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పుట్టపర్తి అర్బన్: కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలని జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్‌కు విన్నవించారు. గురువారం స్థానిక లీడ్ బ్యాంకులో ఆయనకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు అందజేయాలని, రూ.2 లక్షల వరకూ వడ్డీ లేని పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అడపాల వేమనారాయణ, నాయకులు చౌడప్ప, రామయ్య, చిన్నపరెడ్డి, కిష్టప్ప తదితరులు ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉపాధి కూలీలకు పని దినాల పెంపు

గాండ్లపెంట: కరువు మండలాల్లో ఉపాధి హామీ కూలీలకు పని దినాలను పెంచినట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి గురువారం తెలిపారు. 100 రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కూలీలు మరో 50 రోజుల పాటు ఉపాధి పనులు చేసుకోవచ్చన్నారు. ఉపాధి కూలీలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.